కథానిక

# మైలురాళ్లు

యన్. ఆర్. నంది

ఎప్పటినించో అన్నయ్య ఒకసారి ఢిల్లీ రమ్మని రాస్తుంటే యిప్పటికి తీరుబాటయింది. దుర్గాపూజా సెలవులకి కలకత్తాలో బయలుదేరాను.

రెండోనాటికి బండి ఢిల్లీ చేరుకొంది. స్టేషన్‌కి అన్నయ్య ఒక్కడే వచ్చాడు. కంపార్ట్‌మెంట్ దిగుతున్న నా దగ్గరకి చరచరా వచ్చి "నువ్వొక్కడివే-అమ్మరాలేదూ?" అనడిగారు.

"సాయంకాలం ఎక్స్‌ప్రెస్‌లో వస్తానంది" అన్నాను.

ఇద్దరం కలసి బయటికి వచ్చాం. కారులో సూట్‌కేస్ పెట్టి, ఫ్రంట్ సీటులో అన్నయ్య పక్కన కూచున్నాను. కారు మాంచి స్పీడులో పోతోంది.

ఆ కాసేపటిలోనూ మనస్సుల్లో వున్న విషయాల నన్నిటినీ మాటల్లోకి అనువదించి, మాటాడుకొన్నాం. ఇక ఏంతోచక అలానే మూగప్రతిమల్లా, వెనక్కి పోతున్న భవంతుల కేసీ,మనుష్యుల కేసీ ముఖ్యంగా డిమ్‌గ్లాసెస్‌తో, సిల్కు చీరల్లో తళుక్కుమంటున్న విలాసినుల కేసీ దృష్టిని పోనిచ్చాం

చివరికి కారు కానింగ్ లేన్ లోకి వచ్చేసరికి ఎందుకో అప్రయత్నంగా అన్నాను

"ఈ కార్లని తయారుచేసే కార్మికులకి, ఇవెక్కి తిరిగే అదృష్టం లేదు."

అన్నయ్యకామాట అర్థంకాలేదు "అంటే?" అన్నాడు.

"అంటే, కష్టపడి ఈ కారుని తయారుచేసే కార్మికుడికి, మనలాగే ఈ కారెక్కి తిరిగేందుకు హక్కు లేదు."

"ఓహో! అదా?" అంటూ నవ్వాడు "కొంతమంది సుఖపడడానికి, మరి కొందరు కష్టపడాలోయ్."

ఈ సుభాషితం నాకు చాలా కటువుగా తోచింది.

"ఆ కొంతమంది సంఖ్యలో ఎక్కువవుంటే ఫర్వాలేదు. కాని లక్షమంది చెమటూడ్చితే ఒక్కడు కాలుమీద కాలేసుకొని సుఖించడం చాల అన్యాయం."

"పొరపడుతున్నావు. కష్టానికి ప్రతిఫలం సుఖం. ఆజీవి కష్టపడిందంటే అందుకు ప్రతిఫలంగా కొంత పైకొన్నిస్తారుగా!"

"ఆ పారితోషికం వాళ్ళ కేమూల?"

"అదీ నన్నే అడిగితే ఏం లాభం? వాళ్ళ మొత్తం కష్టానికి తగిన ప్రతిఫలం యిస్తూంటే, ఆ తీసుకొన్న 'కష్ట' మనేది, ఈ తీసుకొన్న వానికి స్వర్గసుఖాన్నిస్తుంది ఎందుచేతనంటే అందరికీ తను తగినంత ప్రతిఫలాన్నిచ్చి, దాన్ని మొత్తంగా తీసుకొంటున్నాడు గాబట్టి."

"అదే అన్యాయం."

"అన్యాయమెలా అవుతుంది."

"తప్పకండా అన్యాయమే. జీవులందరూ ఒకటే అనుకొన్నపుడు, శ్రీమంతుడు తన ఆస్తితో కొన్నివేలమంది నెత్తినెక్కి స్వారీ చేయడం, తన ఆస్తితో వాళ్ళ సుఖాన్నిగూడ కొనేయడం అన్యాయం గాక మరేమవుతుంది?"

"అక్కడే నువ్వు అర్థం చేసుకోవలసింది ఎంతో వుంది. కలిమిలేములు చక్రగతి అన్నపుడు, ఈ 'కాలం' ఈవాళ ఒకర్ని శ్రీమంతుని చెయ్యొచ్చు, రేపు మరొక శ్రీమంతుణ్ణే కటిక దరిద్రుణ్ణి చెయ్యొచ్చు. కాని మనం దానికి విరుద్ధంగా సర్వసమానత్వం అని నోరు చించుకోవడంవల్ల ప్రయోజనం వుండదు."

వాదన పెంచడానికి నాకు యిహ మనస్కరించలేదు. ఈ సమస్యని యిలా ఎందుకు తెలియజే వల్సి వచ్చిందంటే, మొదట ఒక కార్మికుడు రోడ్డుపక్కన ఒక కారుని బాగు చేస్తుండడం నాకంటబడింది ఆ పక్కనే ఆ కారుగల యజమాని నడుంమీద చేతులు వేసుకొని ఆర్డర్స్ యిస్తుండడం కనిపించింది. వాళ్ళిద్దరికీ

గల భేదం ఏమిటీ అని ఆలోచిస్తూ- ఆశ్రయత్నంగా అలా అడిగాను.

ఇంతలో అన్నయ్య బంగాళా వచ్చింది. దిగి యిద్దరం లోపలికి వెళ్ళాం.

వొదినగారు చిరునవ్వుతో ఆహ్వానించారు. లోపలికి వెళ్ళిన తర్వాత స్నానం చేసి, టిఫిన్ అదీ చేసి, అన్నయ్యతో బాటు, కారుమీద బయలుదేరాను మళ్ళా.

ఇంటికి తిరిగి వచ్చేసరికి మూడు దాటి పోయింది అన్నయ్య తిన్నగా బాత్ రూం లోకి వెళ్ళిపోయాడు. నేను బెడ్ రూమ్‌లోకి వచ్చి, సోఫామీద కూచొని షైని మెల్లగా విప్పుకొంటున్నాను. అంతలో నా వెనక చిన్న చప్పుడు వినిపించేసరికి వెనక్కి తిరిగి చూశాను.

'ఎవరు, సుశీల్!"

"బాబాయ్! ..ఎప్పుడొచ్చారు మీరు?" అన్నాడు ఆశ్చర్యంగా.

నాపక్కకి వచ్చి కూచొన్నాడు సుశీల్ నవ్వుతూ.

"ప్రొద్దుట వచ్చాను. అమ్మ చెప్పలేదూ?"

"లేదు బాబాయ్."

"ఏం చదువుకొంటున్నావ్?"

"ఫిఫ్త్ స్టాండర్డ్."

"తెలుగు రాదు కదూ?"

"ఎందుకు రాదు? స్కూల్లో చెప్పరు గాని, యింట్లో అమ్మ చెబుతుంది."

"సరేకాని, వెళ్ళిపోయేటప్పుడు నాతో కలకత్తా వస్తావా?"

"ఎప్పుడు వెళతారు?"

"మరి నాలుగు రోజుల్లో. వస్తావా మరి?"

"ఎందుకు బాబాయ్ ."

"ఎందుకేమిటి? కలకత్తా సిటీ చూడొచ్చు. హౌరా బ్రిడ్జ్, విక్టోరియా మెమోరియల్ హాల్, బొటానిక్ గార్డెన్స్, మింట్ హౌస్. జ్యూట్ మిల్స్, పార్లమెంట్ హౌస్ .."

"అలాంటివి ఇక్కడకూడా వున్నాయ్..."

"అవును కాని, ముఖ్యంగా ఆ ప్రదేశంలో వుండే బెంగాల్ వాళ్ళని చూడాలి. వాళ్ళ మర్యాద, మాట- ముఖ్యంగా వేషభాషలు..."

"సరే వస్తాను" ఒప్పుకొన్నాడు.

సాయంకాలం అలా షికారుగా వెళ్ళి యింటికి వచ్చాను. యింట్లో అన్నయ్య లేనట్లున్నాడు. మెల్లగా లోపలికి వచ్చాను. హాల్లో సోఫామీద పదేళ్ల కుర్రాడొకడు కూచొని బొమ్మలు చూస్తూ, నన్ను చూడగానే సోఫా మీంచి గబుక్కున లేచిపోయాడు.

వంటి మీద మాసిన బట్టలే అయినా పిల్లాడు అందంగా కనపిస్తున్నాడు. బహుశః పక్కింటి డాక్టరు త్రివేదిగారి అబ్బాయి అయి వుంటా డనుకొని

"నీ పేరేమిటి బాబూ?" హిందీలో ప్రశ్నించాను.

"బాబీ" అన్నాడు మెల్లగా.

"అలా నిలబడ్డావేం, కూచో."

బాబీ కూచోలేదు. ఇటూ అటూ చూశాడు. నాపక్కన కూచోడానికి సిగ్గు పడుతున్నాడేమోనని చెయ్యిపట్టుకొని కూచోబెట్టాను.

"ఏం చదువుకొంటున్నావ్?"

"చదువుకోవటం లేదండి."

నాకు ఆశ్చర్యమేసింది. "ఏం?" అన్నాను. అందుకు బాబీ ఏం సమాధానం చెప్పలేదు.

"మీనాన్నగారు స్కూల్లో వెయ్యలేదూ?"

"మానాన్న లేరండి."

"ఏం?"

"చచ్చిపోయారు."

"ఎప్పుడు!"

"నాకు తెలీదు. మా అమ్మ మాత్రం ఇక్కడుంది."

డాక్టరు త్రివేదిగారు చనిపోయినా మాకు అన్నయ్య చెప్పలేదేం? ఆయన మాయింటికి రక్త బంధువులానే వచ్చేవారు. అలాంటిది......! మళ్లా అనుమానం వేసింది. అసలు బాబీ ఎవరి పిల్లాడో అని! ఈ ప్రశ్న వేయాలని నోరు విప్పేసరికి అల్లరి చేసుకొంటూ సుశీల్ వచ్చాడు. వస్తూనే బాబీ చెయ్యి పట్టుకొని—

"అమ్మ దొంగ. నువ్విక్కడ బాబాయ్ దగ్గరున్నావ్..." తెలుగులోనే సుశీల్ మాటాడుతుండడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"ఈ అబ్బాయి ఎవరు సుశీల్?"

"మన వంట మనిషి లేదూ, ఆవిడ కొడుకు బాబాయ్!"

నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. అంత అందమయిన పిల్లాడు! సుశీల్ నాతో "దిల్లగీ" లాడుతున్నాడేమోనని అనుమానించాను. కాని ఒదినగారుగూడ నిజమే అనడంతో సృష్టి వైచిత్ర్యాన్ని కాసేపు విమర్శించుకొన్నాను.

కాని వాళ్ళిద్దరూ చట్టాపట్టాలతో తోట లోకి ఆడుకోడానికి వెళ్ళిపోయారు.

రాత్రి మా అమ్మ కలకత్తా నించి వచ్చింది.

తెల్లవారిన తర్వాత నేనూ అన్నయ్యా కలసి హాల్లోకి వచ్చేసరికి ఎదురుగా మా అమ్మ వచ్చింది కొంత దూరంలో సుశీల్, బాబీలు ఏదో మాటాడుకొంటూ ఆడుకొంటున్నారు.

మా అమ్మ దృష్టి వాళ్ళమీద పడింది. చప్పున వెళ్ళి బాబీని దగ్గరకి తీసుకొంది. సుశీల్ నవ్వుతూ బాబీకేసి చూశాడు. నేను అన్నయ్య కేసి చూశాను.

అన్నయ్య ముఖంలో కొండ్రింపు స్పష్టంగా అగుపించింది. అందుకుతోడు అమ్మ బాబీని సోఫామీద కూచోబెట్టి పక్కనే తనూ కూచుంది.

- అన్నయ్య వాళ్ళదగ్గరకు వెళ్ళాడు. ఆయన్ని చూడగానే బాబీ సోఫాలోంచి గబుక్కున లేచి పోయాడు.

"లోపలికి పో" అంటూ అన్నయ్య కసిరాడు, బాబీని.

"ఏం?" అంది అమ్మ, "అసలా అబ్బాయెవరు—చాల అందంగా వున్నాడు సుమా!"

"మన వంట మనిషి కొడుకు నాని" అన్నాడు సుశీల్.

"ఆఁ!" అంది అమ్మ ఆశ్చర్యంగా.

"ఏ మమ్మా అలా ఆశ్చర్య పోతున్నావ్?"

"నిజంగా సుబ్బమ్మ కొ..డు..కే!"

"మరొక లాగనుకొన్నావా!"

బాబీ యింకా అక్కడ నిలబడటంతో అన్నయ్యవాణ్ణి లోపలికి పొమ్మని అరచి "... ఈ సారి నించి ఈ సోఫాలెక్కావంటే చూడు!" అంటూ వెళ్ళిపోయాడు చర చరా.

ఈ మాట మాసుశీల్‌ని బాధించినంత మరెవరినీ లేదను కొంటాను. బాబీ తలవంచుకొని వెళ్ళిపోతూంటే, వాడివెనకాలే సుశీల్‌గూడ క్షమార్పణ వేడుకొంటున్నట్టు వెళ్ళాడు.

నాకు చాల విచారం కలిగింది. పాపం! బాబి చేసిన తప్పు సుబ్బమ్మ కొడుకయి పుట్టడమే! ఈ సంబంధం తెలియనపుడు అమ్మ గూడ వాడిని దగ్గరకి చేరదీసి, ముద్దులాడింది. కాని తెలిసిన తర్వాత .. ..!

"నిజంగా...వా..డు.." అమ్మ కింకా సంశయమే!

"నిజమే నమ్మా. ఆ మైలం రాళ్లకి కదలిక గాని ముక్తిగాని వుండదు. వాటి సృష్టిగూడ ఈ చిన్న విషయాలనించే వికృతమయి— నువ్వూ, నేనూ, పెద్ద, చిన్న అనే దానికి సోపానమార్గాన్ని కడుతున్నాయి .." అని ఒకనిట్టూర్పు విడిచాను.

—.0:—

"నాకిక కాంగ్రెసుతో సంబంధం లేదు. మనకు శ్రేయోదాయకంగా దేశ భవిష్యత్తుకు రూపు రేఖలు దిద్దగలవాడు నెహ్రూయే గాని కాంగ్రెసు సంస్థకు నాయకత్వం వహించి నడుపుతున్నవారు, నెహ్రూ మాట సాగకుండా ఆయన కృషిని విఫలం చేయాలని ప్రయత్నిస్తున్నారు. జనరల్ ఎన్నికలు ముగియగానే పండిట్ నెహ్రూను కాంగ్రెసునుండి వెళ్ళగొట్టుటకు గూడా యీ నాయకులు పట్టుదలతో ఉన్న సూచనలుగూడా కన్పిస్తున్నవి. నెహ్రూ విధానాలకు, ఆయన కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఉన్న యే పార్టీలోనూ నేను చేరను. నెహ్రూను వ్యతిరేకించే వారంతా దేశానికి, తద్వారా నాకూ శత్రువులే"—రఫీ అహమ్మద్ కిద్వాయ్